


వాదోప వాదాలతో మిత్రబృంద మంతా వచ్చి సముద్రతీరాన తిష్ఠ వేసింది.

స్త్రీలు సహజంగా ఆవేశంలో తామేం చేస్తున్నారో అది ఏ విధంగా పరిణమిస్తుందో ఏమీ ఆలోచించరు. అందుకే కొన్ని కొన్ని సంసారాల్లో దారుణాలు జరిగిపోతూ ఉంటాయి. మీరెప్పుడైనా పరిశీలించారో లేదో! సంసారాల్లో కల్లోలాలు ఎక్కువగా స్త్రీలవల్లనే కలుగుతూ ఉంటాయి! అన్నాడు భూషణ్.

'అచ్చుగా స్త్రీల మీదికే నెట్టకు నేర మంతా. పురుషులు మాత్రం ఆవేశం వస్తే ఏంజరిగేదీ ఆలోచించి ప్రవర్తిస్తున్నారా ఏమిటి? అసలు ఖూనీలెవరు చేస్తున్నారు? స్త్రీలా? పురుషులా? అంది లత—స్త్రీ సమాజ పక్షపాతి.

'మీరు చాలా పెద్ద పెద్ద విషయాలకు పోతున్నారు కాని స్త్రీ విషయానికి వస్తే ఆలోచన కాదు-ఆవేశం కాదు-ఈ రెండిటిని మించి కొన్ని కొన్ని పరిస్థితుల్లో స్త్రీలు ఖూనీలు కూడా చేయగలరని నిరూపిస్తాను నేను!' అంది ఉమాదేవి హఠాత్తుగా.

అంతవరకూ మౌనంగా ఎటో ఆలోచిస్తూ కూర్చున్న ఉమాదేవి ఇలా అనటంతో మా అందరి వాదనలూ ఠకీమని ఆగిపోయాయి.

'ఏమిటది?' అని అడిగాను నేను.

ప్రతిమా దేవి

'నా జీవితంలో ఒక భాగం!'—శుష్కంగా నవ్వుతూ వెంటనే జవాబిచ్చింది ఉమాదేవి.

మా కుతూహలానికి అవధుల్లేవు ...

* * *

శీతల మలయ సమీరం—ప్రక్కనే సాగరుని నిరవధిక నిర్ఘోషం—వీటిమధ్య చల్లగా, హాయిగా కథ వింటున్నాము.

ఉమాదేవి చెప్పసాగింది.

'నాన్నగారు డాక్టరు. చదువై ఉద్యోగంలో చేరినప్పటినుంచీ ఎంత అక్కర్లేదనుకున్నా రెండు చేతులా సంపాదించారాయన. ఈ లోగా యుద్ధం వచ్చింది. అప్పట్లో నాన్న మిలిటరీ డాక్టరుగా చైనా వెళ్లాడు. చైనాలో మొత్తం మీద ఎన్నాళ్లున్నారో కాని, అక్కడి నుంచి తిరిగి వస్తూ ఆ దేశపు స్త్రీని పెళ్లి చేసుకుని వచ్చారు నాన్న.

నాన్న వివాహితుడై స్వదేశానికి తిరిగి వచ్చిన కొన్నాళ్లకు నేను పుట్టాను. నేను పుట్టిన ఏడాదికల్లా అమ్మ ఏ రోగమూ, నెప్పీ లేకుండా మూడు రోజుల జ్వరంతో చచ్చిపోయింది.

నాన్న జీవితంలో అదొక మహా విషాదఘట్టం. ముప్పైఅయిదేళ్లదాకా నాన్న ఆ రోజుల్లో పెళ్లిలేకుండా ఉన్నారంటే అందుకు ఆయనకు నచ్చిన పిల్ల దొరకలేదన్న దొక్కటే కారణం! అలాటిది ఎక్కడో చైనా దేశపు స్త్రీ, గంభీరుడైన నాన్న నాకర్షించి, ఆయన భార్య కాగలిగిందంటే ఆవిడ ప్రత్యేకత నన్ను మురిపిస్తుంది! నాన్న తన జీవిత కాలంలో ఎవరితోనూ అట్టే మాట్లాడలేదు. ఎవరికీ మనసిచ్చి నట్లుగా ప్రవర్తించలేదు. మనసిచ్చిన ఒకస్త్రీ తన చిహ్నంగా నన్నొదిలేసి మాయమైంది. ఆ రోజుల్లో నాన్న విషాదం ఎటువంటిదో అనుకుంటాను నేను. నాకు బాగా మాటలూ, నడకా వచ్చి నాన్న గడ్డాన్నిపట్టుకు ఊపుతూ ఏవో కబుర్లు చెబుతూ ఉంటే, విషాద గంభీరమైన చిఱునవ్వుతో వాటిని వింటూ ఉండే వారాయన. ఆయనకా గడ్డం ఎప్పుడూ ఉండేదనుకున్నాను నేను. కాని ఆయన చిన్నప్పటి ఫోటోలు అవి చూసి అర్థం చేసుకున్నాను. అదీకాక ఈవా కూడా చెప్పింది. అమ్మ పోయాకనే నాన్న అలా అయిపోయారని.


అసలింతకీ చెప్పవచ్చేది ఈవా గురించే! నాన్న, అమ్మపోయాక నన్నెవరి సంరక్షణలో ఉంచాలన్న సమస్యకి గురి అయ్యారు. ఆయనకి నేనంటే పంచప్రాణాలు. తను నన్ను ప్రేమించే టంత ప్రేమగా, నాపట్ల తన ప్రేమని గురించేటంత సానుభూతితో నన్ను

సంరక్షించే వ్యక్తికోసం ఆయన వెతకసాగారు. ఎందరో నర్సులు ఆయనకి నచ్చక పోవటంవల్ల తిరిగి వెళ్ళిపోవలసి వచ్చింది. కాని అలా తిరిగి వెళ్లని వ్యక్తి ఒక్కతే! ఆవిడే ఈవా! ఈవా నాకు సమస్తమైన పోషణాచేసేది! నాన్న ఇంట్లో లేనప్పుడు ఈవా మీదికెక్కి గుఱ్ఱపు స్వారి చేసేదాన్ని నేను. ఆమె నన్నెంత ప్రేమగా చూసేదంటే కాలక్రమేన నాన్న ధ్యాసకూడా లేకుండా ఈవా ప్రపంచంగా తిరిగేదాన్ని నేను!

'పసిపిల్లని అడ్డదిడ్డమైన వాళ్ల చేతుల్లో ఆలోచించకుండా పెట్టేస్తే అశ్రద్ధగా వదిలేస్తారేమోనని భయంగా ఉండేది ఈవా నాకు! కాని నువ్విలాటి దానివి ఉన్నావని తెలిస్తే అర్థంలేని భయం పెట్టుకోకపోదును!' అనేవారు నాన్న అప్పుడప్పుడు ఈవాతో.

ఈవా ఆ మాటలు విని ఉప్పొంగి పోయేది. తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది నాకిప్పుడు. నాన్న ముఖతః ఎటువంటి ప్రశంసావాక్యం విన్నా ఈవా పులకరించి పోయేది. నన్ను చాటుకితీసికెళ్లి పొంగిపొర్లే ఆనందాన్ని నాపై ముద్దులుగా కురిపించేది. ఒకసారి అలా ముద్దుపెట్టుకుంటూ ఉంటే 'ఒద్దు. చల్లగా ఉంటుంది!' అన్నాను నేను.

ఆమె పెదవులు—ఆహ్లాదకరమైన



"కిట్టూ! నీ కెన్నిమార్కులొచ్చాయిరా"
"అన్నయ్యకంటే నాలుగే తక్కువ ఒచ్చాయి నాన్నా!"
"అన్నయ్య కెన్నిరా?"
"నాలుగు!"

ఒకానొక శీతల స్పర్శని దాచుకున్నట్లుగా ఉండేవి.

నామాట విని ఈవా కళ్లు ఆనందంతో పెద్దవిచేసి చూసి 'నిజంగా అబ్బ! ఈమాటే...తన్ను పారవశ్యంతో చెంపకిచెంప అనించి అర్థాంతరంగానే ఆపేసింది ఈవా.

ఆమె ఆ అర్థోక్తి నప్పట్లో గ్రహించలేకపోయాను. కాని ఇప్పుడది బాగా అర్థమౌతోంది.

కాని, అసలిది ఎప్పుడు ప్రారంభమైందో నే నూహించ లేదు. ఈవా నాన్నని ప్రేమించ సాగింది—ఆమె

మనస్సులో అంతులేని ప్రేమ ప్రవాహం నాన్నపై వేయి ముఖాల విజృంభించి, ఆయన్ని అందులో ముంచేయటానికి సిద్ధంగా ఉంది. కాని నాన్నే అందు కవకాశం కల్పించటం లేదు. గంభీర మైన ఆయన హృదయంలో అమ్మకి తప్ప ఇంకెవరికీ స్థానం లేదనే నా ఉద్దేశం.

ఒకనాడు—అప్పటికి నాకు ఆరేళ్లు నిండాయి.—ఈవా నాకు స్నానం చేయించి ఒళ్లంతా పౌడరు అద్ది గౌను తొడుగుతోంది. అప్పుడే డిస్పెన్సరీకి వెళ్లబోతూ నాన్న ఆ గదిలోనే బూట్లు తొడుక్కుంటున్నారు.

నా మనసులో ఏదో సందేహం కలిగి 'ఈవా! మరేమో అందరికీ మమ్మీ లున్నారు కదా మరి నాకు?' అని అడిగాను.

నా మాట విని ఈవా చప్పున విచిత్రంగా నాన్న వేపు చూసింది. నామాట విని నా వేపు విషాదంగా నవ్వుతూ చూస్తున్న నాన్న చూపులు అప్రయత్నంగా, అనుకోకుండా ఈవాతో కలిసాయి. మరుక్షణంలో ఏమైందో నాకైతే ఊహించే శక్తిలే దప్పట్లో నాన్న చటుక్కున లేచి పోయారక్కడినుంచి.

ఆ రోజునుంచీ నాన్న ఈవాతో అంతగా మాట్లాడినట్లు గుర్తులేదునాకు. అప్పటినుంచే నా పోషణలో ఈవాకి శ్రద్ధ సన్నగిల్లుతూ వచ్చింది.

అప్పటినుంచీ అప్పుడప్పుడు ఈవా నన్ను చాటుగా విసుక్కుంటూ ఉండేది. అయినా పెంచిన ప్రేమ—ఈవాని నే నొదల్లేక పోయాను. అసలు పసిపిల్లల్ని ప్రత్యక్షంగా కొట్టి తిట్టి హింసిస్తే తప్ప, సామాన్యమైన విసుగు దలకు ఎదుటి వారిలో తమపట్ల ప్రేమ లోపించిందని గుర్తించలేరు వాళ్లు. నా పనీ అంతే అయింది.

మా యింటి చుట్టూ ఆంగ్లో యిండి యన్లూ పెద్దపెద్ద మళయాళీ కుటుం బాలు ఉండేవి. ఒకనాడు ఎదురింటి సిసిల్ వాళ్ల మమ్మీ గురించి చెబుతూ ఉంటే మళ్లీ అడిగాను ఈవాని.

'ఈవా! నాకమ్మ ఎవరు?' అని

ఈవా జాలిగుండె కరగినట్లయింది. నన్ను అమాంతం అక్కడినుంచి ఎత్తు కుని తీసికెళ్లి 'నేనే నీ అమ్మని!' అంది నన్ను తనహృదయానికి హత్తుకుంటూ.

'కాదు నువ్వు ఈవావి! అన్నాను అమాయకంగా.

'కాదు మీ అమ్మనే!' అంది ఈవా నవ్వుతూ.

'కాదు. నాన్న చెప్పారు. అమ్మ ఆకాశంలో ఉందని!' అన్నాను రాబోయే పరిణామం ఊహించలేక.

ఆ మాటలు విన్న ఈవా కళ్లలో,

ఏదో, ఏదో ఒక భావం—నాకు మాత్రం భయం కలిగించింది;—అలాటి భావం పొడసూపింది. నన్ను అమాంతం ఒక్క ఉదుటున కిందికి దించి, కాదు-పడేసిందనే చెప్పాలి—ఈవా గబగబా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఆరోజు ఈవాకీ, నాన్నకీ మధ్య ఏం జరిగిందో తెలియదు. అసలు ఈవా అక్కడున్న అన్ని ఏళ్ళల్లోను—వాళ్ళిద్దరిమధ్యా ఏం జరిగిందో తెలియదు. కాని ఏమీ జరక్కుండా ఉందని మాత్రం నమ్మలేను. అప్పటికివన్నీ గ్రహించటానికి నేనుచిన్నదాన్ని. కాని ఇప్పుడవన్నీ కేవలం ఊహిస్తూంటాను. ఈవా నాన్నకి తన ప్రేమ ప్రకటించి ఉంటుంది. కాని నాన్న ఆమెకే మాత్రము సందిచ్చి ఉండరు. ఆయన హృదయం ద్వైధీభావపూర్ణంకాదు. ఒక్కటే నిశ్చితాభిప్రాయం ఆయనది. ఆయన ఈవా ప్రేమని తిరస్కరించి ఉంటారు. నా ఈ ఊహ కనుగుణంగా ఒకసారి తనగదిలోంచి బయటికి వస్తూ నాన్న లోపలఉన్న ఈవాతో "ఇలాటి వేమీలేకుండా ఉంటేఉండు. లేకపోతే వెళ్ళిపో. బేబీకి బాగా అలవాటయ్యావని నిన్ను తెగించి పంపేయలేకుండా ఉన్నాను. కాని ఈసారి అదికూడా చూడనింక. నీ యిష్టం. నే చెప్పింది గుర్తుంచుకుని అలా ఉంటే ఉండు లేకపోతే వెళ్ళిపో! ఈ పిచ్చి వేషాలు నా దగ్గర సాగవు!' అంటూ రావటం చూశాను నేను.



కోపంగా బయటికివచ్చే నాన్నని చూసి భయంగా గోడకంటుకపోయి నుంచున్నాను నేను. కాని ఆయన అంతకోపమూ నన్ను చూడగానే మంచులా కరిగిపోయింది. గబగబా నాదగ్గరకువచ్చి 'బేబీ' అంటూ నన్ను కావిలించుకుని నిశ్శబ్దంగా ఏడ్వ సాగారునాన్న. ఎంతసేపు? ఒక్క క్షణం అలా ఉండి మఱుక్షణంలో చప్పున కళ్ళు తుడుచుకొని వెళ్ళి పోయారాయన.

ఉఁ. ఏం చెబుతున్నాను? ఆఁ. నన్నలా కిందపడేసి వెళ్ళిపోయిన రోజున ఈవా నాన్ననేమని ప్రాధేయ పడిందో తెలియదు. ఏభంగపాటు పొందిందో చెప్పలేను. కాని ఆ మర్నాడు బాగా పొద్దుపోయింది. నాన్న ఇంకా డిస్పెన్సరీనించి ఇంటికి రాలేదు. ఈవా గదిలో కూర్చుని నా చేత ఇంగ్లీషుపాఠం చదివిస్తోంది.

ఈలోగా బయటకారు హారన్ మోగింది. నాన్నరాక కదిగుర్తు.

పుస్తకంలోంచి తలెత్తి సంతో షంతో 'నాన్న వచ్చారు!' అన్నాను.

ఈవా పెదవులురెండూ బిగించి ముభావంగా 'ఉఁ' అని చదవ మన్నట్లుగా సంజ్ఞచేసింది. తలవంచు కుని మళ్ళీ చదువులో పడ్డాను. ఒక పావుగంట అయినా గడిచిందోలేదో— ఉన్నట్లుండి నాన్న చాలా కోపంగా ఈవాని పిలవటం వినిపించింది.

ఆ పిలుపుకి ఈవా మాట్లాడకుండా లేచి నుంచుంది. ఎప్పుడో తానిలాటి సమయం ఆసన్నమవుతుందని ముందే ఊహించినదానిలా నిశ్చలంగా గది లోంచి వెళ్లింది.

అప్పటికే నాన్న పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ఈవాకెదురుగా రావటం చూసాను నేను.

'ఫోటో తీశావా?'—గదిగుమ్మంలో నుంచుని భయంగా చూస్తున్నాను నేను. నాన్న కోపంతో ఉడికి పోతున్నారు.

'ఏ ఫోటో?'—ఈవా తెలియనట్లుగా సూటిగా నాన్నని ప్రశ్నించింది.

నాన్న కోపంతో పిడికిలి బిగించారు.

'ఏ ఫోటోనా? తెలియదా నీకు? చెప్పు! ఏం?'

ఈవా చప్పున ధైర్యంగా 'తెలియదు' అంది.

'తెలియదూ?'

'ఉహుఁ.'

తొణకని జవాబుకి నాన్న ఆమెని నమిలి మింగేద్ద మన్నంత కోపంతో చూశాడు.

కాని ఆమెనేమీ చేయలేని అశక్తతతో,

'సరే! నీకు తెలియకపోతే సరే! కాని ఈ క్షణంనించీ ఇంట్లో ఉండనక్క—

ళ్లేను నువ్వు. వెళ్లు. డబ్బేమైనా రావలసి ఉంటే జాన్ నడిగి తీసుకు వెళ్లు.' అంటూ గిరుక్కున తిరిగి వెళ్లి పోయారు.

నాన్న మాటలకు ఈవా నిశ్చేష్టు రాలై నేలకంటుకు పోయి నుంచుంది. బహుశా ఆమె నాన్ననించి ఇటువంటి మాట ఎదురుచూసి ఉండదు. వాళ్ల మాటల్లో ఏదీ అర్థం కాని నేను నెమ్మదిగా ఈవా దగ్గరకు వెళ్లి గౌను పట్టుకు లాగాను.

ఈవా తలతిప్పి నా వేపుచూసింది.

నాకళ్లు భయంగా ప్రశ్నిస్తున్నాయి.

ఆమె మాట్లాడకుండా నన్ను తీసుకుని తోటలోనికి నడిచింది.

మేడమీద జాన్ గదిలోంచి దీపపు వెలుతురు అస్పష్టంగా మామీద పడుతోంది.

ఈవా ఒక సిమెంటు బెంచీమీద నీరసంగా చతికిల పడింది.

తన రెండు చేతుల్నీ నా బుజాల మీద వేసి నన్ను దగ్గరకు లాక్కుంటూ బాధగా 'బేబీ! రేపు పొద్దున నేను వెళ్లిపోవాలి. వెళ్లనా మరి?' అని అడిగింది.

ఆమె కౌగిట్లో ఇమిడిపోయి 'ఎందుకు ఈవా' అని అడిగాను నేను అమాయకంగా.

ఈవా నాకు జవాబివ్వలేదు. తనలో



"అప్పుడు నేను తెలివితక్కువ దద్దమ్మనై నిన్ను పెళ్లి చేసుకున్నాను."
"ఆ సంగతి నేను పెళ్ళయిన మర్నాడే తెలుసుకున్నాను."

తనే అస్పష్టంగా 'ఎందుకూ? అవును. ఎందుకు వెళ్లాలి నేను?' అనుకోసాగింది మాటిమాటికీ.

నాకీ పరిస్థితి అంతా చాలా అయోమయంగా ఉంది. ఆకస్మికమైన నాన్న కోసం, ఈవా స్వగతాలూ—ఏవీ నాకర్థం కానళ్లే భయంతో నింపి వేసాయి.

'ఈవా'

ఈవా నా మాట వినిపించుకోకుండా ఉన్నట్లుండి ఆవేశంతో నన్ను వెనక్కి నెట్టి లేచి నిలబడింది.

'అవును. ఎందుకు వెళ్లాలి నేను?

ఎవరు నన్ను వెళ్ళమనేది? నేను వెళ్ళను. ఏమైనాసరే వెళ్లను. ఎలా వెళ్లగొడతారో చూస్తాను!' అంటూ, నేనొక దాన్ని అక్కడ అంత సేపటినుంచీ ఆమెతోపాటే ఉన్నానన్న ధ్యాస అయినా లేకుండా గబగబా లోపలికి వెళ్లిపోయింది ఈవా.

ఆ రాత్రి—ఇంచుమించు అర్ధరాత్రి అయి ఉంటుంది. మంచి నిద్రలో ఉన్నాను నేను. హఠాత్తుగా ఈవా కంగారుగా నన్ను లేపటం వినిపించింది.

'బేబీ! బేబీ! గెటప్! గెటప్!' అంటోంది ఈవా.

'ఏమిటి?' అన్నాను మగతగా'

'గెటప్ బేబీ! ప్లీజ్ గెటప్!'— ఊరికే ఆయాస పడిపోతోం దామె.

నాకేమైందీ అర్థం కాలేదు. అయోమయంగా, కంగారుగా లేచి కూర్చున్నాను. ఈవా నా ఆలస్యం భరించలేనట్టుగా చేతుల్లోకి నన్ను తీసుకుని గబగబా నాన్న గదిలోకి పరుగెత్తింది.

అప్పుడు నాకు పదేళ్లు నిండాయి. జీవన్మరణాలలో మానవుల పరిస్థితి ఎలాటిదో తెలియకపోయినా, అవంటే మాత్రం తెలుసు. మనిషి పుడతాడనీ చచ్చిపోతాడనీ, చచ్చిపోవట మంటే మరింక ఆ మనిషి కనిపించడనీ నాకు తెలుసు.

నాన్న గదిలోకి తీసికెళ్లి ఈవా నన్ను ఆయన పక్కనే కూర్చోబెట్టింది. నాన్న పక్కమీద నిశ్చైతన్యంగా పడి ఉన్నాడు. కళ్లు తెరచి ఏదో మాట్లాడాలనుకుంటున్నారు. కాని మాట పెగిలి రావటం లేదు.

ఈవా ఆయన భావం గుర్తించినట్లుగా నా చెయ్యి నాన్నకందించింది.

ఆ క్షణంలో ఈవావేపు నాన్న చూసిన చూపు చిన్నదాన్నైనా నా మరచిపోలేకపోయాను. కాని ఆ చూపులోని తీక్ష్ణత ఆట్టేసేపు నిలవలేదు. అసలా కళ్లు నీరసంగా మరుక్షణంలోనే మూసుకున్నాయి.

ఈవా ఇంచుమించు గట్టిగా నే ఏడుస్తూ 'క్షమించండి. క్షమించండి.' అనసాగింది మాటిమాటికీ.

కాని నాన్న మాట్లాడేస్థితిలో లేరు. ఆయన నన్నేంచేయా లనుకున్నారో, ఎవరి రక్షణలో ఉంచదలచుకున్నారో, ఏదీ చెప్పకుండానే కళ్లు మూసారు.

భయంతో ఈవా గావుకేక పెట్టబోయి వెంటనే తమాయించుకుంది. భయంతో ఈవాని గట్టిగా కావిలించుకున్నాను నేను. ఈవా విసురుగా నన్నొదిలించుకుని నాన్న మంచం పక్కన గ్లాసులూ అవీ గబగబా కడిగి పెట్టేసి, నాన్న నోటివెంట వచ్చిన నురుగు తుడిచేసి ఆ బట్ట జేబులో దాచేసుకుంది. ఇదంతా అయ్యాక నన్ను ఎత్తుకుని హాల్లోకివచ్చి గట్టిగా జానుని పిలవటం మొదలు పెట్టింది.



"జాగ్రత్తగా గడ్డంగియ్యి. గాట్లు పెట్టకుండా."
"నా సంగతి మీకు తెలియదేమో కాని బాబూ! నేను గడ్డం గీశానంటే ఒక్క గాటుకూడా పడదు. పడిందంటే ఒక గాటుకి పావలా చొప్పున ఇచ్చేస్తాను. అంతెందుకు అలాగే ఒకసారి ఒకాయనకి 5 రు॥లు ఇచ్చాను."

ఆ కేకలకి జాన్ నిద్రలేచి రావటం, చుట్టూ ఉన్నవాళ్లకి కూడా నాన్న మరణించిన సంగతి తెలియటం,— నిట్టూర్పులు, విచార ప్రకటనలతో నాన్నని దహనం చేయటం—అలా అంతమైంది నాన్న జీవితం....' అని కాస్సేపాగింది ఉమాదేవి. ఆమెకళ్లలో అశ్రువులూరి అంతలోనే ఇంకిపోయాయి.

అందరమూ శ్రద్ధగా కిక్కురుమనకుండా వింటున్నాము.

అంతవరకూ ఊపిరిబిగపట్టి ఆత్రంగా కథ వింటున్న లత పెద్ద నిట్టూర్పు విడుస్తూ 'ఉఁ చెప్పు! తర్వాతేమైంది?' అని అడిగింది ఆగలేనట్లుగా.

గద్గదమైన కంఠం సవరించుకుని మళ్లీ చెప్పసాగింది ఉమాదేవి. 'నాన్న చచ్చిపోయారు. నా గతేమిటని చుట్టుపక్కల వాళ్లు విచారించ సాగారు. నాన్న పోవటంతో జాన్ ఇల్లు ఒదిలి వెళ్లి వేరే ఉద్యోగం చూసుకున్నాడు. నాయర్, బాయ్ అంతా వెళ్లిపోయారు. ఇక మిగిలింది ఈవా. ఆమె కూడా వెళ్లిపోతుందనే చుట్టుపక్కల వాళ్ల ఊహ. నాన్నగారు నా పేర యాభై వేల రూపాయలు బాంకీలో వేసారు. కాని అవి నా మైనారిటీ తీరితే కాని రావు. ఈలోగా ఏం కావాలి నా గతి? అదికాక పది, పదకొండేళ్ల దాన్ని ఒంటరిగా ఎలా బతగ్గలను? కాని అక్కడే ఉంది ఈవా స్త్రీత్వం! మొత్తం మీద నాన్న చచ్చిపోయిన నాటినుంచీ ఆమెలో విపరీతమైన మార్పు వచ్చేసింది. ఆమె నన్నొదల లేదు. నన్ను కంటికి రెప్పలా కాపాడేది. ఎప్పుడూ ఏసుక్రీస్తు ఫోటో ముందు చేతులు జోడించి 'నా పాపానికి నిష్కృతి ఉంటుందా ప్రభూ?' అని కన్నీటితో ప్రార్థించేది. కేవలం ఆకస్మికంగా, అనూహ్యంగా నేను, భగవంతుడూ ఈవా ప్రపంచం అయి

పోయినాము. ఇంకేవీ అట్టే పట్టించుకునేది కాదు. ఎక్కడైనా, ఎవరైనా హత్యచేసి శిక్ష అనుభవిస్తున్నారని చదివినా, విన్నా నిలువెల్లా ఒణికిపోయేది. కొన్నాళ్లకు ఆమె ఆ యిల్లు మా యిద్దరికీ చాలా పెద్దదనీ నాకు కాన్వెంటుకి దూరమనే నెపంతో అద్దెకిచ్చేసి ఒక చిన్న యింట్లోకి మారింది. నా అనుమానం మాత్రం నాన్న చచ్చిపోయిన ఆ యింట్లో ఆమె ఉండలేకపోయిందనే!!

నేను పెద్దదాన్నయాను. నాబాల్యం నాకు లీలగా మాత్రమే జ్ఞాపకముంది. ముఖ్యంగా నాన్న చావుని గురించి, ఈవాకీ, నాన్నకీ మధ్యజరిగిన ఘర్షణల గురించి అస్పష్టమైన కొన్ని అనుమానాలు ఉన్నాయి.

ఒకనాడు, మా పాతయింటికి ఏవో రిపేర్లు కావాలని అద్దెకున్న వాళ్లు రాస్తే ఈవాతోపాటు చూడటానికి వెళ్లాను. ఈవా మొదట రానన్నది. కాని నా బలంతం మీద వచ్చింది.

నేను, ఇల్లంతా కలయచూస్తు, నాన్న బతికి ఉన్నప్పుడు నివసించిన గది దగ్గరకు వచ్చాను. లోపలికి అడుగు పెడుతూ రిపేర్లు అవసరమనే అనిపిస్తుంది కదూ ఈవా, అని ఆగి ఈవా వేపుతిరిగి చూసాను.

ఆశ్చర్యం! ఈవా మొహంలో కత్తివాటుకి నెత్తురుచుక్కలేదు. నుంచున్నచోటే తెలివితప్పిపడిపోతుందా అన్నట్లుగా ఉంది.

'రా ఈవా' అన్నా నామెపరిస్థితి గుర్తించక. ఈవా కదల్లేదు. భూమి కంటుకుపోయినట్లుగా నుంచుంది.

'ఈవా' అన్నా నాశ్చర్యంగా.

'ఇకనుంచీ ఈయింటికీ, ఆస్తికీ, అన్నిటికీ యజమానురాలివి నువ్వు. రిపేర్లు అవసరమనిపిస్తే తప్పక చేయించు;'—తెచ్చిపెట్టుకున్న నవ్వుతో ఈవా నాన్నగదిలోకి రాకుండానే తడబడుతున్న అడుగులతో అవతలకు వెళ్లిపోయింది.

నేను గదిలోకి వెళ్ళాను. పాత జ్ఞాపకాలన్నీ, ఛాయామాత్రంగా నాలో మెదిలేవన్నీ స్పష్టంగా గుర్తుకిరా సాగాయి. నాన్న మంచంకిటికీకెదురుగా ఉండేది. గదిలో ఒకమూల ఫ్లవర్ వాజ్, మరొకమూల బుక్ కేసూ ఉండేవి. నాన్న తలవేపుకూడ ఒకబుక్ కేసుండేది. ఎదురుగా కిటికీకి పైగా గోడకి అమ్మ ఫోటో తగిలించి ఉండేది. నాన్న రోజూ దానివేపు చూస్తూ చాలాసేపు గడిపేవారు....

ఫోటో అనగానే నాకు ఆనాటి సంఘటన జ్ఞాపకం వచ్చింది. తలెత్తి కిటికీపైన చూచాను. అమ్మ ఫోటో అక్కడే ఉండేది. ఇప్పుడది ఎక్కడ ఉందో? నాన్న ఆ రోజు ఈవామీద 'ఫోటోతీశావా?' అని కేకలువేశారు.

ఏ ఫోటో అది? అమ్మ ఫోటో! ఎక్కడ ఉంది?

అద్దెకిచ్చేటప్పుడు ఇల్లంతా ఖాళీ చేసి సామాన్లన్నిటినీ జాగ్రత్తగా ఒక గదిలో వేసి దాచింది ఈవా. అందువల్ల ఈవాకే ఈవిషయము తెలుస్తుందని గబగబా గదిలోంచి ఇవతలకు వచ్చాను.

ఈవా అప్పటికి నాకోసం పోర్టికోలో వెయిట్ చేస్తోంది.

'ఈవా, నాన్న గదిలో అమ్మ ఫోటో ఉండాలి. అది తెలుసా నీకు? అని అడిగాను.

ఈవా పెదవు లస్పష్టంగా కదిలాయి. అంతలోనే అబద్ధం ఆడలేనట్లుగా 'తెలుసు. పద వెళ్దాం' అంటూ కాంపౌండు బయటికి నడిచింది.

అవసరమైన రిపేర్లు అద్దెలో మినహాయించి చేయించుకోమని ఇంట్లో ఉన్న వాళ్ళతో చెప్పి బయటికి వెళ్ళాను నేను.

ఇంటికి రాగానే 'అమ్మ ఫోటో ఎక్కడుంది ఈవా?' అని అడిగాను.

'నాదగ్గిర!' అంది ఈవా.

నాలోని ఒక అనుమానం ఇప్పుడు సగం నిజమైంది.

'ఆ రోజు నాన్న దానికోసమేనా నీ మీద కేకలు వేసింది?'

'అవును.' అంది ఆమె.



"ధరలు మండిపోతున్నాయి, ఇచ్చేపింఛను చాలటం లేదు, చాలటం లేదని తిరుగుబాటు చేద్దామంటే వీలులేదు."

'ఎందుకు దాచావు దాన్ని? పోనీ తీసానని అయినా ఎందుకు చెప్పలేదు నాన్నతో?' అని అడిగాను.

ఈవా జవాబు చెప్పలేదు నాకు. మౌనంగా, అపరాధిలా తలవంచు కూర్చుంది.

'ఫోటో ఇవ్వవా ఈవా?' అని అడిగాను జాలిగా.

నేనలా అడుగుతూ ఉంటే ఈవా కళ్లనిండా నీళ్లు నిండాయి. అప్పుడనిపించింది నాకు. ఆమెకి వయసుకు మించిన వార్ధక్యం వచ్చేసిందని.

'నేను నీ తల్లిని కాదా బేబీ? తల్లిలా పెంచా నేనిన్ను!' అంది కరుణాపూరితంగా.

కాని, ఆరాత్రి, ఒకవేపు నాన్న చచ్చిపోతే గ్లాసులు కడగటం విష యంలో శ్రద్ధవహించిన ఆమె కాఠి న్యం, ఇంట్లో ఎవరికీ నాన్న నిద్ర పోతూ ఉంటారన్న ఊహని మించి మరేమీ కలగనప్పుడు 'గెటప్! గెటప్!' అంటూ ఆమె నన్ను లేపి కెళ్ళిన సన్నివేశం—ఇవన్నీ మనసులో నాకు బాగా పాతుకుపోయాయి. ఆమెనిగురించి నాకెన్ని అనుమానా లున్నాయో, అంతగా పెంచిందన్న కృతజ్ఞతాఉంది. కాని ఆక్షణంలో,— పాతజ్ఞాపకాలన్నీ మనసుని కలచే ఆ క్షణంలో ఈవా 'తల్లిలా పెంచానే నిన్ను!!' అని వాపోతూ ఉండే ఆ ప్రేమ నాకు నిజంగా దుస్సహమే అయింది. అందుకే నా అసహ్యాన్ని, వెగటుతనాన్ని దూరం చేసుకోవటానికి ఆమెకి దూరంగా వెళ్ళిపోయాను.

కాని మళ్ళీ ఇంకొకరోజు అడి గాను. 'ఇవ్వవా ఈవా?' అని.

ఈవా ఈసారి జాలిగా ఏడ్చింది. 'నాకు మిగిలిందేమిటి?' అంది బాధగా.

'ఏం కావాలి నీకు? నిన్ను ప్రేమిస్తూనేఉన్నానుకదా ఈవా కాని ఆమె నాతల్లి! ఆఫోటో ఇవ్వు!'

'లేదు. లేదు. నీ అవసరానికి మాత్రమే నీవునన్ను ప్రేమిస్తున్నావు!' అంది ఈవా తలతిప్పుతూ.

నాలో ఉన్నట్లుండి కోపం ఉవ్వె త్తున పొంగింది. 'నా అవసరం కోసమే నిన్ను ప్రేమించే ఉన్నట్లవుతే, అది తీరిన ఈనాడు నాన్న చావుకోసం నిన్నేమైనా చేసి ఉండేదాన్ని ఈవా' అన్నాను చటుక్కున.

అన్నానేకాని నా ఊహ అబద్ధ మవుతే? అదికేవలం ఊహే అవుతే?

కాని క్షణంలో ఈవా మొహం తెల్లగా పాలిపోయింది. వివర్ణమై పోయిన మొహంతో, వణికే కంఠంతో 'నీకుతెలుసా బేబీ? నీకు తెలుసా ఆ విషయం? తెలుసాబేబీ?' అని అడి గింది. ఆమె కళ్ళలోంచి కన్నీరు ధార కడుతోంది.

'తెలుసు. కాని ఇన్నాళ్లూ దానిని గురించి ఎందుకడగలేదంటావు? చెప్పు ఈవా?'

ఈవా చప్పున నుంచున్న చోటే కూలబడింది. రెండు చేతులతోనూ మొహం కప్పేసుకుని మోకాళ్లమధ్యన దాచుకుంటూ 'అడుగు బేబీ! అడుగు. అప్పటికి కాని నా పాపం పండిపోదు. అడుగుబేబీ! ఇన్నాళ్ళనించీ నేను మన సులో పడేబాధని, వ్యధని ఆ విధంగా నైనా రూపుమాపుకుంటాను. అడుగు బేబీ!' అంది ఏడుస్తూ.

బాధతో సుడిపడుతూ అలాగే నుంచున్నాను నేను. అన్నిటికంటే నే నూహించే విషయాన్ని ఈవా నిజ

మని అంగీకరించటమే దారుణ ఘాతంగా ఉందినాకు. అంతకంటే ఆమె అదంతా అబద్ధమని బుకాయించినా నేనంత షాక్ తినేదాన్ని కాదేమో.

చాలా సేపు దుఃఖంతో ఏమీ మాట్లాడలేక పోయింది ఈవా. కొంత సేపటికి తమాయించుకుని 'నీకు తెలియదు బేబీ! ఈ పదేళ్ళనుంచీ మానసికంగా నేననుభవించే బాధ, ఏ న్యాయ చట్టాలు విధించే శిక్షకీ సరికాదు. అందుకే ఏడుస్తున్నాను. నాకు మిగిలిందేమిటని. నీకోసం మీయింట్లో చేరిన నాకు అతనూ దక్కలేదు. నువ్వూ దక్కలేదు. ఇద్దరూ ఆమెకే అంకితమైపోయారు. నేనుమాత్రం ఒక మహాపాపం మూటగట్టుకుని పరలోకంలో బాధకి సిద్ధంగా కూర్చున్నాను. అబ్బ! బేబీ! నా జీవిత మిలా పరిణమించిందేమిటి ?'

ఇప్పుడీ మనిషి నిలా తీసికెళ్ళి పోలీసులకు ఒప్పగిస్తే ఏమవుతుందన్నంత కక్ష చెలరేగింది నాలో. కాని నాలోని క్రౌర్యం కరిగించేస్తూ ఈవా మళ్లీ చెప్పసాగింది.

'కాని బేబీ! ఆరాత్రి అటువంటి దారుణమైన పనిచేస్తానని, చేయగలనని నాకే నమ్మకంలేదు. ఏదుర్విధి నన్నలా ప్రోత్సహించిందో, ఏ దుష్టగ్రహం ఆవేశించిందో అలా చేసేశాను. కాని మరుక్షణంలోనే 'ఈపని నేనేనా చేసింది ?' అని అంతులేని ఆశ్చర్యం కలిగింది, ఆ రాత్రి నిజంగా చచ్చిపోయింది అతనుకాదు. ఈవా చచ్చిపోయింది. నీ యెదుట ఉన్న ఈవా ఇప్పుడు జీవిత సర్వస్వం—ఆఖరికి బతకాలన్న వాంఛతోపాటు, చావాలన్న కోరిక కూడా కోల్పోయి బతుకుతోంది. బేబీ! ఇంత శిక్ష తమకుతామై ఎక్కడైనా లోకంలో ఎవరైనా అనుభవించారా? చూశావా అసలు?'

నాన్నకి జరిగిన ఘోరానికి నేనేడుస్తున్నాను. అంతఘోరం తనవల్లనే జరిగినందుకు కుమిలిపోతోంది ఈవా.



"ఏంరా సుబ్బారావ్ నీ వీ మధ్య పెళ్ళాం మాటలువిని, బంధువులతో, స్నేహితులతో పోట్లాడి ఎవరితో మాట్లాడటం లేదటగా?"
"నీకీ సంగతి ఎవరు చెప్పారు ?"
"నా భార్య చెప్పిందిలే !"

'బేబీ! అతనుపోయాక నేనుకూడా ఇల్లొదిలిపోతే నీవాధారం లేకుండా అయిపోతావని, అలా అవుతే నా పాపం అసలు పరిహారం కాదని, పర లోకంలో కూడా నాకు పుట్టగతు లుండవని నీకు కట్టుబడి పోయాను బేబీ!' అంటోంది ఈవా.

'ఫోటో ఇవ్వు ఈవా జరిగినవాటిని తలచబోకు!' అన్నాను కళ్లు తుడుచు కుని.

ఈవా మెల్లగా లేచి వెళ్లింది. కాస్సేపటికి చేతిలో ఫోటోతో తిరిగి వచ్చింది. ఆత్రంగా వెళ్ళి అందుకున్నా నది.

అమ్మ! చిన్నప్పుడే లోకంనించి నిష్క్రమించిన అమ్మ. ఒక వ్యక్తిని గాఢంగా ఆకర్షించి అతని జీవితా దర్శమై వెలసింది. మరొక వ్యక్తిలో అంతులేని అసూయచెలరేపింది. చిన్న మెరిసే కళ్లూ, చక్కని ముక్కూ, పట్టుకుచ్చులాంటి చక్కని జుట్టూ, అందమైన లేత పెదిమలూ, యౌవనం తొణికిసలాడే మొహమూ! అబ్బ! ఎంత అందంగా ఉంది!!

ఆత్రంగా, బరువుగా, బాధగా, సంతోషంగా, దుఃఖంగా అనేక భావ పరంపర లొక్కసారిగా ముసురుకున్న మనసుతో ఫోటో పరికిస్తున్న నన్ను చూసి, ఈవా పరాజితురాలిలా తల వంచుకుని నెమ్మదిగా వెళ్లిపోయింది.

ఆ రాత్రి జీవిత వైచిత్రి మలచబడిన వివిధ సంఘటనలను పర్యవలోకిస్తూ మగత నిద్రలో ఉన్నాను.

హఠాత్తుగా నా పక్కమీద తలవేపు బరువుగా ఎవరో కూర్చున్నట్లని పించింది.

భయంతో నా నరాలు బిగుసుకు పోయాయి. అంతలో 'బేబీ!' అనే ఈవా కంఠ స్వరం వినగానే నా భయం ద్విగుణీకృతమైంది. ఈవా నన్ను కూడా చంపటానికి రాలేదు కదా!

పక్కమీదినుంచి దిగ్గున లేచి కూర్చు న్నాను.

కాని జీవిత సర్వస్వం కోల్పోయిన బికారిలా, శూన్యమైన చూపులతో, పరిశుష్కమైన శరీరంతో, చేతులు రెండూ మంచానికానించి దీనంగా కూర్చున్న ఈవాని చూస్తే నా భయం నాకే అమానుషత్వంగా తోచింది.

'బేబీ! నిద్రలోంచి లేపాను!' అంది జాలిగా నవ్వుతూ.

'ఫరవాలేదు. ఏమిటి?' అన్నాను.

'అయితే నువ్వు నన్ను పోలీసులకు పట్టిస్తావా బేబీ, ఆగి ఆగి సందేహిస్తూ అడిగింది.

జాలితో నిండిపోయింది నా గుండె. ఆమె ఇంత దీనురాలై పోవటం ఇదే మొదటిసారి.



"మీనాయనగాని అమ్మగానీ ఉన్నారా ఇంట్లో?"
"నాయన ఉన్నాడు, చిట్టిపిల్లకు పాలుపడుతూ. అమ్మ పోట్లాడి అమ్మమ్మగారింటికి పోయింది."

'అలాంటి ఉద్దేశం నీకుంటే నీ చేతులతోనే నాకు విషమివ్వు బేబీ! అలా నీ ప్రతీకారం తీర్చుకో!' అంది ఈవా మళ్లీ.

ఆమె కళ్లనిండా అశ్రువులు నిండి ఆ గుడ్డి వెలుతుర్లో మెరిసాయి.

'నేనంత నీచురాలని కాదు ఈవా' అన్నాను నెమ్మదిగా.

ఈవా దుఃఖంలోనే సంతోషపడుతూ 'నాకు తెలుసు బేబీ! నా జీవితంలో నేనేదైనా మంచిపని చేశానంటే అది నిన్నొక మనిషిగా తయారు చేయటమే! ప్చ్ నేనేం చేశాను? అసలు మంచికీ నాకు ఎంత దూరం?' అని నిట్టూర్చింది.

నాకేం మాట్లాడాలో తోచటం లేదు.

కాస్సేపటికి ఈవా అన్నది. 'నాకు తెలుసు బేబీ! ఇంతవరకూ నేను నీ ఆస్తికీ, నీకూ కూడా సంరక్షకురాలిగా ప్రవర్తించినా, ఇకనించీ ఆ అంతస్థునించి దిగిపోక తప్పదని నాకు తెలుసు. అలా దిగిపోవటమే నాకిష్టంకూడా. ఇకనించీ నేను నీ సంరక్షకురాలినికాదు బేబీ! నీవే నా పోషకురాలివి. నన్ను నీ నర్సుగా మాత్రమే చూడు! అంతేకాని ఎప్పుడో జరిగిన నేరానికి నన్ననుమానించి వెళ్లగొట్టకు బేబీ! ఈ ప్రపంచంలో నాకిక బ్రతుకతగిన స్థానమేదీ లేదు. శాంతిగానైనా, అశాంతిగానైనా ఇక్కడ మాత్రమే ఉండగలను. నన్ను వెళ్లగొట్టకు బేబీ!' అంది ప్రార్థనాపూర్వకంగా.

పక్కమీద ఆమె చేతులు తొలగించి దిండు కానుకుని పడుకున్నాను. 'చెప్పాను కదా ఈవా! ఎప్పుడో జరిగిపోయిన వాటికోసం ఇప్పుడు కక్షలు పెంచుకుంటే లాభం లేదని నాకు తెలుసు నిన్ను పోలీసులకూ పట్టించను విషమూ ఇవ్వను. శిక్ష నేర్పే పశ్చాత్తాపం దానంతటదే

కలిగింది నీకు ! ఇంకా శిక్ష లెందుకు?' అన్నాను.

ఈవా చేతివేళ్లు చల్లగా నా నుదుటిని తాకాయి.

నా మాటలు విని ఆలోచిస్తూ కూర్చున్న ఈవా హఠత్తుగా నా ముందుకివంగి, కంఠస్వరం తగ్గించి 'కాని బేబీ! స్త్రీ హృదయం అర్థం చేసుకోగలవా నువ్వు? క్షమించు. ఇప్పటినించీ నీకీ విషయా లనవసర మనుకో. కాని అర్థం చేసుకునే వయసు వచ్చినప్పుడైనా నీ ఈ ఈవాని సరిగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తావా? ఊఁ. చెప్పు! ఏం బేబీ?' అంది గాద్గదికంగా.

'వెళ్లి పడుకో ఈవా!' అన్నాను సానుభూతితో.

ఈవా నిట్టూర్చింది. గాఢంగా నా నుదుటిని ముద్దుపెట్టుకుని వెళ్లి పోయింది.

అప్పటినించీ మరణ పర్యంతం ఈవా నాదగ్గరే ఉంది. రెండేళ్ళ క్రిందట ఆమె చచ్చిపోయింది. అమ్మ మరణం నే నెఱుగను. నాన్న మరణంతో విచార మెరుగను. కాని ఈ రెండూ ఈవా మరణంతో నా కనుభవ మయ్యాయి. ఈవా తప్పు చేయ నివ్వండి. కాని ఆమె నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి పెంచిందన్న విషయాన్ని మించి, స్త్రీగా ఆమె స్వభావాన్ని విచారించితే ఆమె తాను ముమ్మూర్తులా స్త్రీనని నిరూపించుకుందనిపిస్తుంది నాకు. ఒక విధంగా ఇలా ఉన్నతంగా ఆలోచించటంవల్లనే ఆమెని నేనుక్షమించగలిగాననిపిస్తుంది. తనలో ఏగాంభీర్యం కారణంగా నాన్న ఈవాని స్వీకరించటానికి నిరాకరించారో, ఆ గాంభీర్యం కారణంగానే ఆమె నర్థం చేసుకోగలిగాను నేను. అంతా కథ! కథే!! అంది ఉమాదేవి దీర్ఘంగా నిట్టూరుస్తూ.

పడమట సంధ్యారుణ కాంతులు చీకటి నీడల్లోపడి రూపుమాసి పోతున్నాయి. నీలినీడలు పర్చిన నీటి అలలతో సాగరుడు నిరవధిక నిర్ఘోషం చేస్తున్నాడు. మిత్రబృందమంతా ఉమాదేవి చెప్పిన కథని గురించి గంభీరమైన ఆలోచనల్లో మునిగి పోయింది.........

